సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ¦ 30 ¦ జూన్ ¦ 2023



రూల్స్ పాటించు.. సేఫ్‌గా ఉండు

ట్రాఫిక్ రూల్స్ పాటించి సేఫ్‌గా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, హెల్మెట్ ధరించాలని, సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని చెబుతున్నారు. - 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)-రూ.59,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,379
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,540
నవర (8 గ్రా) - రూ.44,320

గరిష్టం/కనిష్టం
39.5 /29.5

వాతావరణం

గురువారం గాలిలో తేమ 40 శాతం ఉంది. శుక్రవారం ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవంగా వెంగమాంబ 16 రోజుల పండగ



ప్రత్యేకాలంకరణలో శ్రీవెంగమాంబ-గురవయ్యస్వామి విగ్రహాలు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి ఉత్సవాల 16 రోజుల పండగ గురువారం వైభవంగా జరిగింది. దేవస్థానాన్ని, ఆలయ గర్భ గుడిని వివిధ రకాల కూరగాయలు, పుష్పాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ అర్చకులు శ్రీవెంగమాంబ అమ్మవారు - గురవయ్యస్వామి దంపతులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. 16 రోజుల పండగ, తొలి ఏకాదశి పర్వదినం ఒకేరోజు రావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అలాగే హోమ గుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంగీత విభావరి, చిన్నారులతో భరతనాట్యం ప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



విశేష అలంకరణలో దేవస్థాన ప్రాంగణం

వేటకు ప్రతికూలం



సముద్రంలో లభించిన సన్న రొయ్యలు

ముత్తుకూరు: 'వేట నిషేధం' తొలగించిన తర్వాత సముద్రంలో చేపల వేటకు ప్రతికూల వాతావరణం కొనసాగుతోంది. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో 1,728 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. మత్స్యసంపద పునరుత్పత్తి కోసం ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు సముద్రంలో 'వేట నిషేధం' విధించింది. అనంతరం పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని భావించిన మత్స్యకారులకు సముద్రంలో వస్తున్న ప్రతికూల పరిస్థితులతో నిరాశ ఎదురవుతోంది. సముద్రంలో విపరీతమైన గాలుల వల్ల ఎక్కువ సేపు వేట చేయలేని పరిస్థితి నెలకొంది. మరో వారం రోజులపాటు ఇలాగే ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు.

నత్రజని లోపం.. పంటకు శాపం



- భూమిలో తగ్గుతున్న నత్రజని శాతం
- పంటల పెరుగుదల, దిగుబడిపై ప్రభావం
- భూసార పరీక్షల్లో వెల్లడి
- ఈ ఏడాది 7,430 మట్టి పరీక్షల లక్ష్యం
- ఇప్పటికే 1000కి పైగా పూర్తి
- సహజ సిద్ధమైన ఎరువులతోనే మేలు
- రైతులకు సూచిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

భూమిలో అన్నిరకాల పోషకాలు తగినంత ఉంటేనే మొక్కలు సజావుగా పెరుగుతాయి. సహజసిద్ధంగా లభించే ఆ పోషకాలు భూమిలో లేకపోతే ఆ ప్రభావం పెరిగే మొక్కలపై తప్పనిసరిగా పడుతుంది. ఎన్ని ఎరువులు, మందులు వినియోగించినా ప్రయోజనం ఉండదు. ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల్లో భూమిలో నత్రజని శాతం తగ్గిపోతుందని వెల్లడైంది. ఈ నేపథ్యంలో రైతులు సాగు చేస్తున్న పంటలపై నత్రజని లోపం ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే భూమిలోని పోషకాల లోపాలను నివారించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): రైతులు ప్రధానంగా భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆ శాఖ అధికారులు సూచిస్తుంటారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని చెబుతారు. జిల్లాలో ఈ భూసార పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే.. సాధారణంగా భూమిలో 9 రకాల పోషకాలు ఉంటాయని, వీటిలో సేంద్రియ కర్బనం(ఆర్గానిక్ కార్బన్) 70 శాతం, నైట్రోజన్(ఎన్) 95 శాతం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే జింక్ 46 శాతం, ఐరన్ 32 శాతం, కాపర్ 12 శాతం, మాంగనీస్ 22 శాతం, బోరాన్ 33 శాతం, పాస్ఫరస్ 17 శాతం,



భూసార పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ (ఫైల్)

పొటాషియం 68 శాతం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో దాదాపుగా 8 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలపై ఈ పోషకాల తగ్గుదల ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

పెరుగుదల, దిగుబడిపై ప్రభావం

జిల్లాలోని రైతులు నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రానికి తమ పొలాల్లోని మట్టిని పరీక్షల కోసం తెస్తుంటారు. కాలానుగుణంగా వేసే పంటల విషయంలో భూమిలోని మట్టిని 15 సెంటీమీటర్ల లోతులో తీసి పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఉద్యాన పంటలకు 6 అగుడుల లోతు వరకు మట్టిని తీసి రైతులు పరీక్షల కోసం తీసుకువస్తుంటారు. ఇటీవల దాదాపుగా 1,100 భూసార పరీక్షలను సంబంధిత అధికారులు చేయగా వీటిలో 80 శాతం వరకు సేంద్రియ కర్బనం, నైట్రోజన్ భూమిలో తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగిలినవి కొన్ని అటుఇటుగా ఉన్నా ఎక్కువగా మొక్క పెరుగుదలకు అవసరమయ్యే ఈ రెండు పోషకాల లోపం పంటల పెరుగుదల, దిగుబడిపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

ప్రత్యేక క్యూఆర్ కోడ్

వ్యవసాయశాఖ సిబ్బంది భూసార పరీక్షల కోసం జిల్లాలోని ఎంతోమంది రైతుల నుంచి మట్టిని సేకరిస్తుంటారు. భూసార పరీక్షలకు సంబంధించి ఎక్కడా తేడా జరగకుండా ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు ఈ ఏడాది ప్రతి మట్టి పరీక్షకు క్యూఆర్ కోడ్‌ను ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. భూసార పరీక్షలకు సంబంధించి మట్టి పరీక్ష ఏ దశలో ఉంది.. ఎప్పుడు పూర్తి చేస్తారనే విషయాలు క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే వీలు కల్పించారు. ఈ విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షలు పూర్తయ్యాక పూర్తి వివరాలతో కూడిన సాయిల్ హెల్త్ కార్డును రైతులకు అందిస్తున్నారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు పంటలను సాగు చేస్తే సత్ఫలితాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

సాయిల్ హెల్త్ కార్డు అందిస్తున్నాం



రైతులు అందించిన మట్టికి అన్నిరకాల పరీక్షలు చేసి భూమిలో ఏఏ పోషకాలు ఏ విధంగా ఉన్నాయో తెలిపేలా సాయిల్ హెల్త్ కార్డును అందిస్తాం. ఈ ఏడాది ఇప్పటి వరకు నిర్వహించిన భూసార పరీక్షల ఆధారంగా భూమిలో నత్రజని, సేంద్రియ కర్బనం శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఈ ఫలితాల ఆధారంగా పంటలు వేసుకుంటే లాభదాయకంగా ఉంటాయని చెబుతున్నాం. ఈ ఏడాది నుంచి క్యూఆర్ కోడ్‌ను అమలులోకి తీసుకువచ్చాం. దీని ద్వారా రైతులు తాము అందించిన మట్టికి సంబంధించి భూసార పరీక్ష ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంది.

– కన్నయ్య, ఏడీఏ,
భూసార పరీక్ష కేంద్రం

సేంద్రియ ఎరువుల వినియోగంతో మేలు

జిల్లాలో సాగు చేసే పంటలకు రబీ, ఖరీఫ్ సీజన్లలో 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వివిధ రకాల ఎరువులను వినియోగిస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ అధిక మోతాదులో వీటిని వినియోగించకుండా విడతల వారీగా వాడాలని సూచిస్తున్నారు. ప్రధానంగా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే నైట్రోజన్, సేంద్రియ కర్బనం వంటివి భూమికి అందడంతో పాటు, మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో సాంకేతిక కారణాల వల్ల 2వ యూనిట్లో నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని తిరిగి ప్రారంభించారు. దీంతో గురువారం 1వ యూనిట్లో 390 మెగావాట్లు, 2వ యూనిట్లో 340 మెగావాట్లు, 3వ యూనిట్లో 470 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు వెల్లడించారు.

నేటి నుంచి సబ్సిడీపై టమాటాలు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని రైతుబజార్లలో శుక్రవారం నుంచి సబ్సిడీపై ప్రజలకు టమాటాలు పంపిణీ చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లో టమాటాలు కిలో ధర దాదాపుగా రూ.80 ఉన్న నేపథ్యంలో ప్రభుత్వమే టమాటాలు కొనుగోలు చేసి సబ్సిడీపై కిలో రూ.50కే ప్రజలకు విక్రయించనున్నట్లు తెలిపారు. ఒక రేషన్ కార్డుకు 2 కిలోల చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేటలో ఉన్న రైతుబజార్, నవాబుపేటలో ఉన్న రైతుబజార్‌లో శుక్రవారం ఉదయం ఉదయం 11 గంటల నుంచి సబ్సిడీపై టమాటాల పంపిణీని ప్రారంభిస్తామని, సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య



దొరసానమ్మ (ఫైల్)

దుత్తలూరు: సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పని చేస్తున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుత్తలూరు మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని నందిపాడుకు చెందిన షేక్ దొరసానమ్మ(24) మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లి సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తోంది. గురువారం బక్రీద్ సందర్భంగా విధులకు సెలవు కావడంతో ఇంటి వద్దే ఉంది. మధ్యాహ్న సమయంలో బంధువులు ఇంటికొచ్చి పలుమార్లు పిలిచినా పలకలేదు. దీంతో ఇంటిపక్కన ఉన్న వారు వచ్చి తలుపులు కొట్టినా ఎలాంటి స్పందన లేదు. బలవంతంగా తలుపులు తీయగా దొరసానమ్మ ఉరేసుకుని ఉండడాన్ని చూసి పెద్దగా కేకలు వేశారు. దీంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని కిందకి దించారు. సమాచారం అందుకున్న ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, దుత్తలూరు ఎస్సై ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని సీఐ తెలిపారు. దొరసానమ్మ ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి
- మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింలు

నెల్లూరు(బృందావనం): త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ఇస్లాం శాంతిని బోధిస్తుందని బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ వ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు(దువా) చేశారు. ఈద్గా వద్దకు విచ్చేసిన ముస్లింలను ఉద్దేశించి ఆయన బక్రీద్ సందేశం వినిపించారు. ఇస్లాం బోధనల ప్రకారం ప్రతి ముస్లింలో త్యాగస్ఫూర్తి నిండి ఉంటుందన్నారు. సహనం, సత్ప్రవర్తన, సోదరభావం, దేశభక్తి, పరస్పర సహకారం లాంటి సుగుణాలే దేశాభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. అలాగే ఈ నెలలోనే ముస్లింలు మక్కాలోని పవిత్ర మసీదు కాబెతుల్లాను దర్శించుకోవడానికి చేసే హజ్ యాత్ర తదితర విశేషాలను వివరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని ముస్లింలకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఆయా మసీదులు, ఈద్గాల వద్ద మతపెద్దలు బక్రీద్ సందేశం వినిపించారు.



ముస్లింలకు బక్రీద్ సందేశం వినిపిస్తున్న సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

- పొలాల్లో విద్యుత్ లైన్ సరిచేస్తుండగా ప్రమాదం
- కలిగిరి మండలం కుమ్మరకొండూరులో ఘటన
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం
- సొంతంగా మరమ్మతులు చేయవద్దన్న విద్యుత్‌శాఖ అధికారులు



కంచెంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి (ఫైల్)



వేల్పుల నారాయణ (ఫైల్)

కలిగిరి: పొలాల్లో విద్యుత్ తీగలు లాగుతుండగా కరెంట్ షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన కలిగిరి మండలం కుమ్మరకొండూరులో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కంచెంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి(48), వేల్పుల నారాయణ(47) ప్రాణాలు కోల్పోయారు. కుమ్మరకొండూరు గ్రామానికి చెందిన రైతు కంచెంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి వ్యవసాయ మోటార్‌కు సంబంధించిన ఎల్‌టీ లైన్ కిందకు వేలాడుతుండడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగ తెగిపోయి ఉంది. దీంతో అయ్యప్పరెడ్డిపాళెంలో ప్రైవేట్‌గా ఎలక్ట్రికల్ పనులు చేసే వేల్పుల నారాయణను తీసుకుని ఉదయాన్నే పొలానికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి తీగలను లాగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అవి 11 కేవీ విద్యుత్ లైన్ తీగలపై పడ్డాయి. దీంతో మల్లికార్జున్‌రెడ్డి, నారాయణ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. వారి శరీర భాగాలు కొంతవరకు కాలిపోయాయి. ఉదయం 11.30 గంటల సమయంలో పక్క పొలంలో మోటార్ ఆన్ చేయడానికి వచ్చిన కాపుగర్ల మాలకొండయ్య సమీప పొలంలో మృతదేహాలను చూసి గ్రామంలోకి వెళ్లి విషయం తెలియజేశాడు. గ్రామస్తులు, పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేసుకోవద్దని ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ రైతులకు సూచించారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కావలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వంటమాస్టర్‌గా పనిచేసి..

ఈ ప్రమాదంలో మరణించిన అయ్యప్పరెడ్డిపాళెనికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వేల్పుల నారాయణ పేరున్న వంట మాస్టర్. ప్రముఖ హోటళ్లలో చెఫ్‌గా పనిచేశాడు. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో గాయపడడంతో వైద్యుల సూచనల మేరకు వంట పనులు మానివేసి ఎలక్ట్రికల్ పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. నారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఒక్కసారి మాట్లాడు నాన్నా..

నాన్నా.. లేచి ఒక్కసారి మాట్లాడు అంటూ మల్లికార్జున్‌రెడ్డి కుమార్తె రోదించడం అక్కడి వారిని కలచివేసింది. మల్లికార్జున్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేశారు. గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం చిక్కుడు చెట్లు వేసి వాటికి నీరు కట్టడానికి విద్యుత్‌లైన్ సరిచేస్తూ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.

సోమశిలలో 30.277 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 30.277 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,300, ఉత్తర కాలువకు 280, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. జలాశయంలో 91.672 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

సాక్షి మీడియా గ్రూప్ , ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై రేపు
ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూలై 1వ తేదీ (శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు నెల్లూరులోని దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, సోమశేఖరపురం నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ :
జూలై 1, 2023 (శనివారం)

వేదిక:
దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి(డీఎస్ఆర్) కల్యాణ మండపం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్ సోమశేఖరపురం, నెల్లూరు

సమయం :
ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

వివరాలు పంపాల్సిన ఫోన్ నంబర్: 8985094499

వేడుకగా తొలి ఏకాదశి



తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో కొలువై ఉన్న స్వామివార్లకు శాస్త్రోక్తంగా పూజలు, సేవలు విశేషంగా నిర్వహించారు. నెల్లూరు నగరంలోని రంగనాయకులపేటలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఉదయం, సాయంత్రం రంగనాథస్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన బంగారు గరుడసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రంగనాథుని దర్శించుకున్నారు. – నెల్లూరు(బృందావనం)

అది నెల్లూరులోని ఓ ప్రధాన రోడ్డు.. వాహనదారులు తమ దారిలో వెళ్తూ ఉన్నారు. ఇంతలో ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై లాంగ్ రూట్‌లో హారన్ కొడుతూ స్పీడ్‌గా వచ్చారు. ఇదేంటని అడిగిన వారిని నీకెందుకు పో అన్నారు. మరో రోడ్డులో కొందరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఇష్టారీతిగా డ్రైవింగ్ చేస్తున్నారు. నగరంలో ఇవి నిత్యం కనిపిస్తుంటాయి. ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. ఫైన్ వేస్తున్నా తీరు మార్చుకోరు. దీంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

రూల్స్ పాటించు.. సేఫ్‌గా ఉండు

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ప్రమాదాల నివారణే లక్ష్యం
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి జరిమానా విధింపు



నెల్లూరులో నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా నగర ట్రాఫిక్ పోలీసు అధికారులు విస్తృత చర్యలు చేపట్టారు. రూల్స్ పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు. అయితే కొందరిలో మార్పు రావడంలేదు. వరుస రోడ్డు ప్రమాదాల్లో బాలలు, యువకులు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో నిబంధనల అమలు విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనులపై భారీ జరిమానాలు విధిస్తున్నారు.

ఇవి తప్పనిసరి

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పోలీసు అధికారులు పదేపదే సూచిస్తున్నారు. అయినా అనేకమంది వాహనచోదకులు పట్టించుకోవడం లేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. హెల్మెట్ ధరించని వాహనచోదకుడికి రూ.100, వెనుక కూర్చున్న వ్యక్తికి రూ.100, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోకపోతే రూ.100, ఇద్దరికైతే రూ.200 జరిమానా విధిస్తారు.

రాంగ్ రూట్‌లో..

నగరంలో పలుచోట్ల యూటర్న్‌కు చాలా దూరం వెళ్లాల్సి వస్తుంది. అందుకే పలువురు వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు. ప్రమాదాలకు ఆస్కారం ఉంది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని ఎంత మొరపెట్టుకున్నా అనేకమంది పెడచెవిన పెడుతున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా రయ్ అంటూ దూసుకుపోతున్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చే ద్విచక్ర వాహనాలు, కారు.. వాహనం ఏదైనా రూ.1,000, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1,000 జరిమానా విధిస్తారు.

ట్రిపుల్ రైడింగ్

ట్రిపుల్ రైడింగ్ నేరంతోపాటు చాలా ప్రమాదకరం. బైక్‌పై ముగ్గురు ప్రయాణించే సమయంలో బ్యాలెన్స్ చేయలేకపోతే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంది. ట్రిపుల్ రైడింగ్ వెళ్తూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కితే రూ.200 నుంచి రూ.1,000 వరకు జరిమానా విధిస్తారు.

నంబర్‌లు కనిపించకపోతే..

వాహనానికి ముందు, వెనుక నంబరు ప్లేట్లు, వాటిపై నంబర్లు అన్నీ స్పష్టంగా కనిపించాలి. నంబర్ ప్లేట్‌పై ఇష్టానుసారంగా పేర్లు ఉండకూడదు. ప్లేట్ లేకపోయినా, దానిపై అంకెలు స్పష్టంగా కనిపించకపోయినా బైక్‌కు రూ.100, కారుకు రూ.200 ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది.

డ్రంక్ అండ్ డ్రైవ్

వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం తాగి వాననాలు నడపడంతో నడిపేవారితోపాటు ఎదుటవారికి కూడా ప్రాణహాని ఉంది. పోలీసు అధికారులు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరంగా నిర్వహిస్తున్నా వాహనచోదకుల్లో మార్పు రావడంలేదు. ఇందులో పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశపెడుతున్నారు. న్యాయమూర్తి సదరు వ్యక్తికి సుమారు రూ.2,000 వరకు జరిమానా లేదా మూడురోజుల నుంచి వారంపాటు జైలు శిక్ష లేదా జరిమానా, జైలుశిక్ష కలిపి విధించే అవకాశం ఉంది.

పత్రాలు లేకపోతే..

వాహనచోదకుడికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. అలాగే ఆర్‌సీ, బీమా, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలను విధిగా దగ్గర ఉంచుకోవాలి. తనిఖీల సమయంలో వాటిని అధికారులకు చూపాల్సి ఉంటుంది. లైసెన్స్ లేకుంటే రూ.500, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు లేకపోతే రూ.1,000, ఆర్‌సీ లేకపోతే రూ.200 జరిమానా విధిస్తారు.

మైనర్ డ్రైవింగ్

18 ఏళ్లు నిండని వారెవరైనా వాహనాలు నడిపితే జరిమానాలే కాదు జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇటీవల మైనర్లు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి



ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇప్పటికే పలు మార్పులు చేశాం. నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిబంధనలపై విస్తృత అవగాహన కలిప్తున్నాం. ఉల్లంఘనులకు జరిమానాలు విధిస్తున్నాం. క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్నాం.

– అబ్దుల్ సుభాన్, ట్రాఫిక్ డీఎస్పీ, నెల్లూరు



రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనదారులు

జనవరి నుంచి మే నెలాఖరు వరకు..

ఉల్లంఘన	కేసుల సంఖ్య	జరిమానా
సెల్‌ఫోన్ డ్రైవింగ్	542	రూ.5,42,000
ట్రిపుల్ రైడింగ్	2,830	రూ.6,65,050
రాంగ్ రూట్	173	రూ.2,55,000
మైనర్ డ్రైవింగ్	332	రూ.1,86,645
డ్రైవింగ్ లైసెన్స్ లేని..	1,519	రూ.8,12,665
ఇతర	6,735	రూ.21,70,280
డ్రంక్ అండ్ డ్రైవ్	666	--

జరిమానాలిలా..

- రిస్ట్రిక్టెడ్ నో ఎంట్రీకి.. : రూ.2,000
- తనిఖీల సమయంలో సరైన వివరాలు తెలియజేయకపోతే.. : రూ.500
- అతి వేగంగా వాహనం నడిపితే.. : రూ.400
- అతి వేగంగా వాహనం నడిపి సిగ్నల్ జంప్ చేస్తే.. : రూ.1,000
- లైట్ వెహికల్‌కు ఎఫ్‌సీ లేకపోతే రూ.2 వేలు, హెవీ వెహికల్‌కు.. : రూ.5 వేలు
- ఆటోల్లో ఓవర్‌లోడ్ ప్యాసింజర్‌కు ఒక్కొక్కరికి.. : రూ.100
- పొగ తాగుతూ వాహనం నడిపితే.. : రూ.200
- డేంజరస్ డ్రైవింగ్‌కు.. : రూ.1,000

19 నుంచి కోటి కుంకుమార్చన



పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో వచ్చే 19వ తేదీ నుంచి కోటి కుంకుమార్చన జరుగుతుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం నెల్లూరులోని తన నివాసంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ వచ్చే నెల 29వ తేదీ వరకు కోటి కుంకుమార్చనను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేక వేడుకలను నిర్వహించగా, తిరిగి జూలైలో కోటి కుంకుమార్చనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తొలి ఏకాదశి రోజున పోస్టర్ ఆవిష్కరించడం శుభపరిణామమన్నారు. ఆయా రోజుల్లో జరిగే వివిధ కార్యక్రమాలకు దాతలు ముందుకురావడం హర్షణీయమన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక వసతులతోపాటు భోజన సదుపాయాన్ని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈట వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు రఘురామయ్య, పద్మజ, విమలమ్మ, విజయమ్మ, సుప్రజ, కామేశ్వరమ్మ, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

అండర్–19 క్రికెట్ టోర్నీ ప్రారంభం

- అనంతపురంపై సెంచరీ చేసిన నెల్లూరు యువకుడు



101 పరుగులు చేసిన మన్విత్

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి – ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా గురువారం ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలిమ్యాచ్‌లో కడప – కర్నూలు జట్లు తలపడ్డాయి. ఇందులో కడప జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం – నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. ఆ జట్టులోని వీరారెడ్డి 68 పరుగులు, వెంకట లోకేష్ 68 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ వెంకయ్య 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు బ్యాట్స్‌మన్ 38.5 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటయ్యారు. జట్టులోని మన్విత్ 95 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్ల 101 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రదీప్ 4, తన్వీర్ 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 116 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 147
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 280
లేయర్ చికెన్	: 184



చంద్రబాబును మళ్లీ ఓడించడం ఖాయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు ఓడించడం ఖాయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక వినాయకనగర్ కాలనీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం సాయికుమార్ ఘన స్వాగతం పలికారు. రామిరెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. అలాగే ఏదైనా కారణాలతో పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎంకు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ప్రతి కుటుంబానికి నవరత్నాలతో లబ్ధి చేకూరిందన్నారు. గతంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు గుడ్‌బై చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఉస్మాన్, కోడూరు సాధిక్ రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, దైవాదీనం తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

కుమారుడిని చూసి వస్తుండగా..

- పాఠశాలకు వెళ్లిన తల్లి
- కావలికి వెళ్లేందుకు మరొకరి స్కూటీ ఎక్కిన వైనం
- ప్రమాదం జరిగి తల్లి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



పద్మావతి మృతదేహం

కావలి రూరల్: ‘ఆ తల్లి తన కుమారుడిని చూసేందుకు ఆశ్రమ పాఠశాలకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఓ మహిళ స్కూటీ ఎక్కింది. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొనడంతో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన గురువారం చెన్నైపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ ఎస్సై టి.సుమన్ కథనం మేరకు.. కావలి రూరల్ మండలం కొత్తసత్రం గ్రామానికి చెందిన కాటంగారి పద్మావతి (37) కుమారుడు చేవూరు వద్ద ఉన్న రామదూత ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. గురువారం సెలవు కావడంతో కొడుకును చూసేందుకు ఆమె వెళ్లింది. అలాగే కావలి శాంతినగర్‌కు చెందిన పొన్నపూడి నాగమణి కుమారుడు అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా చూసేందుకు తన స్కూటీలో వెళ్లింది. తిరిగి కావలి వస్తున్న క్రమంలో అక్కడే ఉన్న పద్మావతి నేను కూడా కావలికి వస్తానని ఆమె స్కూటీ ఎక్కింది. ఇద్దరూ చెన్నాయిపాళెం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పద్మావతి అక్కడిక్కడే మృతిచెందగా నాగమణికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు నాగమణిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. అలాగే పద్మావతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉలవపాడులో వ్యక్తి కిడ్నాప్

- వెంటనే పట్టుకున్న పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం?



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు, ఎస్సై బాజిరెడ్డి

ఉలవపాడు: మండల పరిధిలో ఓ వ్యక్తి కిడ్నాప్‌కు గురి కావడం.. వెంటనే ఫోన్ రావడం, సకాలంలో పోలీసులు వెళ్లి అతడిని పట్టుకున్నారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున ఉలవపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కందుకూరు సీఐ వెంకట్రావు కథనం మేరకు.. ఉలవపాడు హైస్కూల్ సంఘంలో చాకిచర్ల పట్టపుపాళేనికి చెందిన ఓ మహిళ మూడురోజుల క్రితం ఇల్లు అద్దెకు తీసుకుంది. ఆమె వద్దకు బోగోలు మండలం బంగారుపాళేనికి చెందిన ఊటుకూరి పవన్ కళ్యాణ్ బుధవారం వచ్చాడు. అతను రాత్రి అక్కడే ఉన్న సమయంలో పెదపట్టపుపాళేనికి చెందిన వాయిల హరిబాబు, అలగాయపాళేనికి చెందిన కోడూరి గోవిందు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న వారు పవన్ కళ్యాణ్‌ను బయటకు తీసుకొచ్చి కొట్టి కాళ్లు చేతులు కట్టేసి ఆటోలో ఎక్కించుకుని అలగాయపాళెం రైల్వే ట్రాక్ వైపు తీసుకుని వెళ్లారు. దీనిని గమనించిన గుర్తుతెలియని వ్యక్తి 100కి డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు స్పందించి ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడిని వైద్యశాలకు పంపారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో దాడి జరిగినట్లు చెబుతున్నారు. హరిబాబు ఆ మహిళతో నాలుగేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడని, ఈ సమయంలో పవన్ కళ్యాణ్ రావడంతో కట్టి రైల్వే ట్రాక్‌పై వేసి చంపడానికి ప్రయత్నిస్తుండగా ఎస్సై బాజిరెడ్డి అర్ధరాత్రి వెంటనే స్పందించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైతోపాటు సిబ్బంది రాము, కిశోర్, బ్రహ్మయ్యను సీఐ అభినందించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.